

సిద్దిపేట కమాన్ : హరీశ్‌రావుకు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు



సిద్దిపేట టౌన్ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న పద్మశాలీ సంఘం నాయకులు

# హరీశ్‌రావుకు శుభాకాంక్షల వెల్లువ

సిద్దిపేట కమాన్/సిద్దిపేట టౌన్, డిసెంబర్ 7 : ఎమ్మెల్యేగా వరుసగా ఏడోసారి విజయం సాధించిన తర్వాత మొదటిసారి సిద్దిపేటకు వచ్చిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును గురువారం క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు పూల మొక్క అందజేసి శుభాక్షాంక్షలు తెలిపారు. మరోవైపు హరీశ్‌రావును పద్మశాలీ సంఘం జిల్లా నాయకులు బూర మల్లేశం, ప్రభాకర్, ముదిగొండ శ్రీనివాస్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్‌రావును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలను తెలిపారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

**హరీశ్‌రావును కలిసి బీఆర్‌ఎస్ నాయకులు..**

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 7 : సిద్దిపేట ఎమ్మెల్యేగా ఏడోసారి భారీ మెజార్టీతో గెలిచిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కొండపాక బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావును వారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, రైతుబంధు సమితి మాజీ మండల కో-ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ అనంతుల పద్మ, మాజీ ఎంపీపీలు బొద్దుల కనకయ్య, బైరెడ్డి రాధాకిషన్‌రెడ్డి, దుద్దెడ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.



కొండపాక : హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

### అడ్వకేట్‌కు పరామర్శ

సిద్దిపేట, డిసెంబర్ 7 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న సీనియర్ అడ్వకేట్ దేవునూరి రవీందర్‌ను గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. చికిత్స పొందుతున్న ఆయన యోగక్షేమాలు తెలుసుకొని ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీనియర్ అడ్వకేట్ దేవునూరి రవీందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



గులాబీ అధినేత కేసీఆర్‌తో దేవీరవీందర్

## కేసీఆర్‌ను కలిసిన దేవీరవీందర్

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 7 : ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ ఆధ్వర్యంలో కుకునూరుపల్లి మండల ప్రజాప్రతినిధులు గురువారం ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కుకునూరుపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేసినందుకు దేవీ రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 7 : కొండపాక మండలం మర్పడగకు చెందిన ఆకానం కనకవ్వ ఇటీవల పాముకాటుతో మృతి చెందింది. బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్న మృతురాలికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును గురువారం ఆమె భర్త గాలయ్యకు ఎమ్మెల్యే హరీశ్‌రావు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, నాయకులు హేమల్ల రాజిరెడ్డి, ఉపసర్పంచ్ యాదగిరి, ప్రశాంత్, దుర్గయ్య, పద్మ, బాలాజీ, కిషన్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, భాను, బాబు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**



మిరుదొడ్డి : మోతె వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 7 : ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీని తనకు కట్టబెట్టారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మోతె సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, నాయకులు రవి, రాజేశ్వర్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ..**

దుబ్బాక, డిసెంబర్ 7 : దుబ్బాక పట్టణంలోని 17వ వార్డు కౌన్సిలర్ పులిగారి కల్పనాఎల్లం తండ్రి లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణాచారి తండ్రి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు మ్యాదరి భిక్షపతి తల్లి అనారోగ్యంతో మృతి చెందగా వీరి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు ఆస యాదగిరి, నాయకులు రొట్టె రాజమౌళి, భూంరెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రతిభకు అనుగుణంగా విద్యాబోధన చేయాలి

హుస్నాబాద్, డిసెంబర్ 7 : దివ్యాంగ విద్యార్థుల ఆసక్తి, ప్రతిభ ఆధారంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. నేషనల్ డిజాబుల్ డేను పురస్కరించుకొని గురువారం హుస్నాబాద్ పట్టణంలోని దివ్యాంగుల పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. వారికి సామర్థ్య పరీక్ష నిర్వహించి విద్యార్థుల ప్రతిభను అంచనా వేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లలను తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పాఠశాలకు పంపిస్తారని, వారి శారీరక, మానసిక పరిస్థితికి అనుగుణంగా అక్షరాభ్యాసం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దివ్యాంగుల్లో సైతం విద్యావంతులై ఉన్నత స్థాయిలో స్థిరపడినవారు ఎందరో ఉన్నారని తెలిపారు. దివ్యాంగులకు ప్రాథమిక స్థాయి నుంచే మంచి విద్యాబోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగుల పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులందరికీ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రవీణ్, శ్రీనివాస్, సంధ్యారాణి, ఉప్పరపల్లి సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి శివరంజని

## పరస్పర సహకారానికి ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ

ములుగు, డిసెంబర్ 7 : ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని ఎస్‌ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సంస్థల మధ్య పరస్పర సహకారానికి గురువారం అధికారులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ నీరజాప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కళాశాల విద్యార్థులకు అవసరమైన శాస్త్రీయ, సాంకేతిక సమాచారం, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సాంకేతిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ కిరణ్‌కుమార్, పీజీ స్టడీస్ డీన్ రాజశేఖర్, స్టూడెంట్స్ ఎఫైర్ డీన్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన బీఆర్‌ఎస్ నాయకులు

గజ్వేల్, డిసెంబర్ 7 : రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌రావు పుట్టినరోజు సందర్భంగా గురువారం మండల పరిధిలోని అక్కారం గోదాముల ఆవరణలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మొక్కలు నాటి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా నాయకులు కళ్లెపు నవీన్‌రావు, చెప్యాల రాజేశ్వర్‌రావు మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న నాయకులు

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

బెజ్జంకి, డిసెంబర్ 7 : గ్రామాల అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ లింగాల నిర్మల కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. శాఖల వారీగా సమీక్ష చేసి పలు సూచనలు చేశారు. పలువురు అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో నోటీస్‌లు జారీ చేయాలని ఎంపీడీవోకు ఎంపీపీ సూచించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రకళ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డైరీని ఆవిష్కరించిన న్యాయవాదులు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 7 : సిద్దిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం-2024 డైరీని గురువారం కోర్టు సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన డైరీని సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డికి సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 7 : మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన అందె కమలమ్మ-శ్రీనివాస్ దంపతుల కూతురు అందె సోని వివాహానికి గురువారం సర్పంచ్ నాంపల్లి సవితాచంద్రశేఖర్ రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్ దంపతులకు పెండ్లి కూతరు, ఆమె తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలి

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 7 : వార్డు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వార్డు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు పరిధిలో జరుగుతున్న భవనాల నిర్మాణం ప్లాన్ ప్రకారం నిర్మిస్తున్నారా.. లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా పత్రాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఆర్ఐ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 7 : మంచిర్యాల జిల్లాలో ఈనెల 10 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మద్దూరు మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ దామెర ప్రేమ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 విభాగంలో ప్రత్యూష, మా న్విత, సమీరుద్దీన్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు మెదక్ జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.